క్లుప్తంగా

ఎరువు దుకాణాల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ చంద్రశేఖర రెడ్డి

దమ్మపేట: మండలపరిధిలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ శీలం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ... రైతులు అందుబాటులో ఉన్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న సీడీపీఓ

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మెరువు కాలనీ, అటెండర్స్ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక సీడీపీఓ ముత్తమ్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పోషకాహారం, రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రం ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించాలని, లబ్ధిదారులకు మెను ప్రకారం పోషకాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ఎస్‌కె.మైబూన్నీసా తదితరులు పాల్గొన్నారు.

పినపాక తహసీల్దార్‌గా గోపాలకృష్ణ

పినపాక: మండల నూతన తహసీల్దార్‌గా గోపాలకృష్ణను ప్రభుత్వం నియమించింది. రెండురోజుల క్రితం గోపాలకృష్ణను గుండాల డిప్యూటీ తహసీల్దార్‌గా, గుండాల డిప్యూటీ తహసీల్దార్ అనూషను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు చేపట్టక ముందే అనుషను కరకగూడెం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేసి, తిరిగి గోపాలకృష్ణను పినపాక తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దమ్మపేట: మండలంలోని పెద్దగొల్లగూడెం పరిధిలోని 11 కేవి విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ వెంకటరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నివాళి..



కేక్ కట్ చేస్తున్న నాయకులు

అశ్వారావుపేట: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతిని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అమ్మ సేవా సదనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కురిశెట్టి నాగబాబు, పసుపులేటి రామస్వామి, బండారు శ్రీను, లక్కినేని నరేంద్రబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

బూర్గంపాడు: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేతనాలు సక్రమంగా అందక పారిశుద్ధ్య కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, కార్మికుల వేతనాలు ప్రతీనెలా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బస్సుల రాకపోకలకు అడ్డుగా..

అదనపు ఆదాయం పేరిట పెట్రోల్‌బంక్ నిర్మాణం

- నిర్మాణ స్థలంపై స్థానికుల అభ్యంతరం
- వినతులతో పాటు నిరసన దీక్షలు



దమ్మపేట బస్టాండ్ ప్రాంగణంలో నిర్మాణ దశలో ఉన్న పెట్రోల్ బంక్

దమ్మపేట: అదనపు ఆదాయం పేరిట మండలకేంద్రమైన దమ్మపేట బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణం వివాదానికి దారితీసింది. బంక్ నిర్మాణం చేపడితే బస్సులు వచ్చే మార్గం మూసుకుపోతోందని స్థానికులు ఆందోళనలకు దిగారు. బస్సులు రాక బస్టాండ్ నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరుకుంటున్న క్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవ తీసుకుని ప్రాంగణాన్ని శుభ్రం చేయించి కొత్తగూడెం, భద్రాచలం నుంచి వచ్చే బస్సులను ఆగేవిధంగా చేశారు. ఈ క్రమంలోనే బంక్ నిర్మాణానికి పనులు చేపట్టడంతో, నిర్మాణం పూర్తయితే బస్టాండ్‌లోకి మార్గం మూసుకుపోతుందని స్థానికులు పనులు అడ్డుకున్నారు. దీంతో పనులను తాత్కాలికంగా ఆపేసినా నిర్మాణాన్ని పూర్తిగా మార్చాల్సిందేనని స్థానికులు నిరసనలు కొనసాగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే మణుగూరు, భద్రాచలం ఆర్టీసీ డిపోల నుండి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాలంటే వయా దమ్మపేట మీదుగా వెళ్లాల్సిన పరిస్థితులున్న నేపథ్యంలో భవిష్యత్‌లో దమ్మపేట బస్టాండ్‌కు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉండగా.. పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టడం సమంజసమేనా అని ప్రశ్నిస్తున్నారు.

అనుమతులపై సందేహాలు..

సత్తుపల్లి డిపో పరిధిలోనున్న దమ్మపేట బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్ బంక్ నిర్మాణం అనుమతులతోనే చేపట్టామని, పంచాయతీ ద్వారా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌నూ పొందామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. కాగా బంక్ నిర్మాణానికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిన మాట వాస్తవమే కానీ, బంక్‌ను బస్టాండ్ ప్రాంగణంలోని ఏ ప్రదేశంలో కడతారనే విషయంపై పూర్తి సమాచారం లేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. బంక్ నిర్మాణానికి సంబంధించిన నిర్మాణం, డిజైన్, బ్లూ ప్రింట్ తదితర వివరాలను తమకు అందజేయకుండానే నిర్మాణం చేపట్టారని ఎంపీడీవో రవీంద్రారెడ్డి తెలిపారు.

ఆందోళనలు, వినతులు..

పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపాలంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేసి, నిర్మాణ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారె బంక్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించమని డిపో మేనేజర్‌కు సూచించారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో పెట్రోల్ బంక్ నిర్మాణంను ఆపాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా జూన్ 30 నుంచి బస్టాండ్ ఎదుట స్థానిక యువకులు బంక్ నిర్మాణం ఆపాలని రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు.

నల్లమాస్కులతో నిరసన..

బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ, స్థానికులు నల్లమాస్కులను ధరించి శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. భవానీ కృష్ణ, దస్తగీర్, కాంతారావు, రవి, ను, గోపి, ఫణి, వలీ పాల్గొన్నారు.



శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో స్థానికులు

పేరుకే బస్టాండ్..

పేరుకే మండల కేంద్రంలో బస్టాండ్ ఉంది తప్ప, అన్ని బస్సులు వచ్చే పరిస్థితి ఏమాత్రం లేదు. సత్తుపల్లి డిపో నుండి అశ్వారావుపేటకు వయా మందలపల్లి మీదుగా ఎక్కువగా షటిల్ సర్వీస్ బస్సులు తిరుగుతుండగా దమ్మపేటకు షటిల్ సర్వీస్ బస్సుల్లో ఏ ఒక్క బస్సు రాదు. కొత్తగూడెం, భద్రాచలం డిపోల నుండి వయా దమ్మపేట మీదుగా వెళ్లే బస్సులు, హైదరాబాద్, విజయవాడ వెళ్లే సూపర్ లగ్జరీ నైట్ సర్వీసు సర్వీస్ తప్ప వేరే బస్సులు వచ్చే పరిస్థితి లేదు. సత్తుపల్లి నుండి అశ్వారావుపేట వైపు వెళ్లే బస్సులు దమ్మపేటకు రాకపోవడంతో మండల ప్రజలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మందలపల్లి వెళ్లి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్న ఏమాత్రం ఫలితం లేకుండాపోయింది.

కోల్పోతే తిరిగి పొందలేం..



దమ్మపేట బస్టాండ్ స్థలం, బస్టాండ్‌ను కోల్పోతే తిరిగి భవిష్యత్తులో పొందలేం. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే మణుగూరు, భద్రాచలం నుండి ఏపీకు వెళ్లే అన్ని వాహనాలు దమ్మపేట మార్గం గుండా వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పుడు అధిక సంఖ్యలో బస్సులు దమ్మపేట బస్టాండ్‌లోనే ఆగాల్సి వస్తుంది. ఈ బంకు నిర్మాణంతో భవిష్యత్‌లో బస్సులాగే పరిస్థితి ఉండదు. బంకు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నాం.

– అత్యం వెంకటేశ్వరరావు, దమ్మపేట

మార్గం ఏర్పాటు చేస్తాం..



బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లి, బయటకు వచ్చేలా సివిల్ ఇంజనీర్లతో చర్చించి సరైన మార్గం ఏర్పాటు చేస్తాం. పెట్రోల్‌బంక్ నిర్మాణంతో బస్టాండ్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం. ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన మేరకు బస్‌స్టేషన్‌ను ఆధునీకరణ చేసి, అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాం.

– రాజ్యలక్ష్మి, ఆర్టీసీ డీఎం, సత్తుపల్లి

డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ

ములకలపల్లి: ములకలపల్లి శివారులోని ఊర వాగుపై కోతకు గురైన డైవర్షన్ రోడ్డును ఎట్టకేలకు శుక్రువారం పునరుద్ధరించారు. ఈ వాగుపై హైలెవల్ వంతెన నిర్మిస్తున్న నేపథ్యంలో తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఇటీవల కురుస్తున్న వర్షాలకు బుధవారం రోడ్డు కోతకు గురైంది. దీంతో తాళ్లపాయ జీపీ కేంద్రంతోపాటు, పలు గిరిజన గ్రామాలకు వెళ్లే వాహనాలకు దారి సౌకర్యమే లేకుండాపోయింది. దీంతో పక్కనే నిర్మించిన ఐరన్ పాత్‌వే ద్వారా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు. వాగులో మొరం వేసి, కోతకు గురైన ప్రదేశాన్ని మట్టితో నింపారు. ఈ మేరకు రోడ్డు పనులు పూర్తి చేసి, వాహన రాకపోకలను పునరుద్ధరించారు.



డైవర్షన్ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

హక్కుల అణచివేతను ప్రతిఘటించాలి

మణుగూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షకుల హక్కుల అణచివేత చర్యలను ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, దాని భాగస్వామ్యపక్షాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. ప్రభుత్వాల విధానాలను ఖండిస్తూ ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్త చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మె జయప్రదం కోసం అలాగే ఈ నెల 5న నిర్వహించే సమావేశానికి ప్రజాసంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే.రమేష్, నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వారాహి అమ్మవారికి పూజలు



యాగ పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

మణుగూరు రూరల్: మండల పరిధిలోని రామానుజవరం పంచాయతీ కొండాయిగూడెంలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత వైద్యనాథ లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ వారాహి అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిదోరోజు శుక్రవారం వారాహి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అర్చకులు వైష్ణవిదేవి ఉపాసకులు పవన్ శర్మ బృందం మంత్రోచ్ఛరణ నడుమ ఛండీయాగాన్ని, మహాపూర్ణాహుతిని వైభవంగా నిర్వహించారు.

7న గిరిజన దర్బార్

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఈ నెల 7న గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే గిరిజన దర్బార్‌కు సంబంధిత అన్ని శాఖల అధికారులు సంబంధిత రికార్డులతో హాజరుకావాలని, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



రెవెన్యూ కార్యాలయం వద్ద బాధితులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధిలోని పిరాయిగూడెం గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కాంగ్రెస్ యూత్ మండల ఉపాధ్యక్షుడు కారం నవీన్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబాలతో శుక్రవారం రెవెన్యూ అధికారులను కలిశారు. రెవెన్యూశాఖ నుండి అందాల్సిన తక్షణ సాయం రూ.8 వేలు ఇప్పటికీ అందలేదని, తక్షణమే సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ములకలపల్లి: విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండలకమిటీ ఆధ్వర్యంలో పాల్వంచ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న దుకాణాలను వెంటనే మూసేయాలన్నారు.

‘అల్లూరి’ స్ఫూర్తితో పోరాడాలి



మణుగూరు రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన విప్లవవీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎంబీ.నర్సారెడ్డి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అల్లూరి స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అదేవిధంగా దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వై.వెంకట రామారావు అధ్యక్షతన చందర్‌రావు భవన్‌లో జరగగా కొమరయ్య చిత్రపటానికి పార్టీ పట్టణ కార్యదర్శి గద్దం స్వామి పూలమాలవేసి నివాళులర్పించారు.

చంద్రుగొండ : విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు ఆశయాలని ముందుకు తీసుకెళ్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌కె.ఉమర్ అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాదానికి, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ అధ్యక్షుడు తేజావత్ భీముడు, వరికూటి వెంకట్రావ్, రాఘవ్, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: మణుగూరులోని అంబేడ్కర్ సెంటర్‌లో మండల క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి సమితి నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు పీవీఎస్ రాజు, బుద్ధరాజు నవీన్‌బాబు, బీఎస్.రాజు, రాధాకృష్ణ, విజయ్‌కుమార్ రాజు, నాని, బాబు, చక్రవర్తి రాజు, రవిశేఖర్‌వర్మ, ఏఈఓ కొమరం లక్ష్మణ్, నాయకులు పడిగ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న అక్కాతమ్ముళ్లు

ములకలపల్లి: వారసత్వంగా తమకు రావాల్సిన ఆస్తుల్ని తండ్రి పువ్వాల కొండల్‌రావు, పినతల్లి సునిత అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ కూతురు, కొడుకు పువ్వాల జ్యోతి, పువ్వాల సాయి నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ములకలపల్లి మెయిన్‌సెంటర్‌లో ఉన్న తండ్రికి చెందిన భవనంలో డీసీసీ బ్యాంక్ ములకలపల్లి శాఖ కార్యాలయం అద్దెకు నిర్వహిస్తుండగా బ్యాంకుకు షెట్టర్లు వేసి ఫ్లెక్సీతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తల్లి సీతాదేవికి చెందిన స్థిరాస్తిని మోసం చేసి అమ్మేశారని, అంతేకాకుండా కొండల్‌రావుకు చెందిన స్థిరాస్తులను సైతం తమకు దక్కకుండా మోసం చేస్తున్నారని వాపోయారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకొని, వారికి న్యాయం చేయాలని కోరారు. కాగా డీసీసీబీ మేనేజర్ సతీష్, స్థానిక పోలీసులు వారితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విధుల్లోకి తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

దమ్మపేట: విధుల నుంచి అకారణంగా తొలగించిన పంచాయతీ కార్మికులను, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అదే కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ... బాధిత కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురహరి రఘు, విజయలక్ష్మి, వెంకటమ్మ, యశోద, శ్రీను, సత్యావతి, సురేష్ పాల్గొన్నారు.

విస్తృతంగా వైద్యశిబిరాలు



పినపాక: విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మణుగూరురూరల్: రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది



ములకలపల్లి: గురుకులంలో..

పినపాక: ఏజీహెచ్ఎస్ ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలో పినపాక ప్రాథమిక వైద్యకేంద్రం ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వంటశాల, మూత్రశాలలను పరిశీలించి దోమల మందు, బ్లీచింగ్ వంటివి పిచికారీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తప్పనిసరిగా శ్రమదానం నిర్వహించాలని వైద్యులు మధు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామాలైన ఖమ్మంతోగు, బుగ్గలలో గల ప్రభుత్వ పాఠశాలల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సికిల్‌సెల్ అనిమియా పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటింటిని సందర్శించి పరిసరాలను పరిశీలించి నీటి నిల్వలను తొలగించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, కౌసల్య, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాభారతి, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. స్థానిక మంగపేట గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో డాక్టర్ కృష్ణదీపక్ రెడ్డి విద్యార్థులను పరీక్షించి, వైద్య చికిత్సలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ రామకృష్ణ, హైల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, నాగమణి, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

అశ్వారావుపేట: ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని, సమ్మెను అన్నివర్గాల ప్రజలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబిర్‌పాషా అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అశ్వారావుపేటలో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్ల రద్దు కోసం చేస్తున్న సమ్మెలో పార్టీ శ్రేణులు అంతా పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, సయ్యద్ సలీం, ముత్యాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసఫ్ కోరారు. సమ్మె ప్రచారంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమ్మె నోటీసు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మలకలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాసుల పుష్పావతి, నకిరకంటి పుల్లారావు, వెంకటేశ్వర్లు, సాగర్, అలుగుల శారద ఉన్నారు.

దుమ్ముగూడెం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు, కార్మికుల వ్యతిరేక చట్టాలకు నిరసనగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా మండల కార్యదర్శి దాసరి సాయన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు గంగారం గ్రామంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నూపా అర్జున్, కొమరం బాబురావు, కురసం చిన్నయ్య, లక్ష్మి, భరత్, కొరస రామ్‌శెట్టి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ... కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కార్డులను రద్దు చేయాలని, ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ ఈనెల 9 తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహించాలని కార్మిక ఉద్యోగ సంఘాలు నిర్ణయించాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైవి.రామారావు, కొలగాని రమేష్, నకిరికంటి నాగరాజు, అజయ్ కుమార్, అప్పారి రాము, నరసింహాచారి, తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట: మాట్లాడుతున్న సాబిర్‌పాషా



దుమ్ముగూడెంలో..



భద్రాచలంఅర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు